క్లుప్తంగా

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

పీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు



పదవులు పొందిన వారితో శ్రీకాంత్‌రావు

గజ్వేల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన పలువురిని శుక్రవారం గజ్వేల్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులు యాదగిరి, గోపాల్‌రావు, భానుప్రకాశ్‌రావు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'మత్తు వద్దు.. ఆరోగ్యమే ముద్దు'



మాట్లాడుతున్న కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు పాటు పడాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మిరుదొడ్డిలో 'మత్తు పదార్థాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు' అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17నుంచి 22 వరకు మిరుదొడ్డిలో 2కే రన్ లాంటి కార్యక్రమాలు నిర్వహించి డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఐలయ్య, రాజు, బాల్‌రాజు, కుమార్, రమేష్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న మహిళలు

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక మహంకాళి ఆలయంలో శుక్రవారం 9వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు, వస్త్రాలంకరణ, కుంకుమార్చన, దీపారాధన లాంటి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. వైదిక నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వడ్డీ వ్యాపారం చేస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని చేర్యాలకు చెందిన శ్రీకాంత్ శుక్రవారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కుకునూర్‌పల్లి మండలం తిప్పారం గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న బస్వరాజు కనకయ్య పేదలకు వడ్డీకి డబ్బులు ఇస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు

కళాశాల ఆవరణలో చెత్తసేకరణ



చెత్తను సేకరిస్తున్న వలంటీర్లు, అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలోని చెత్తను సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డా.శ్రద్ధానందం, విశ్వనాథం, కృష్ణయ్య, పుణ్యమ్మ, బాలకిషన్, రాణి, నగేశ్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధవి, సిబ్బంది వనిత తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో రక్షణ

చేగుంట(తూప్రాన్): సేంద్రియ వ్యవసాయం చేయడంతోనే నేలను కాపాడుకోవచ్చని సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం రైతులకు నేలను కాపాడుకునేందుకు చేపట్టాల్సిన పద్ధతులను వివరించారు.

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు

భారతరాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాల్లోను జరుపుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, ఆయా రాజకీయ పార్టీల కార్యాలయాల్లోను నాయకులు, విద్యార్థులు, అధికారులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. వివిధ కూడళ్లలోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని, ఆ మహనీయుడి ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.



చేర్యాల(సిద్దిపేట): అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా



కొమురవెల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



దుబ్బాకటౌన్: చైర్‌పర్సన్ తదితరుల నివాళి



మద్దూరు(హుస్నాబాద్): జీవన్‌రెడ్డి తదితరులు..



హుస్నాబాద్: నివాళులర్పిస్తున్న నాయకులు



కోహెడరూరల్(హుస్నాబాద్): బస్వాపూర్‌లో..

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి

చేర్యాల(సిద్దిపేట): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవాల్లో పాల్గొన్న ఆయన శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు ఏక కాలంలో రుణమాఫీ చేసినట్లుగానే నేడు సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 50 వేల ఉద్యోగాల భర్తీ, 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. నాయకులు చేకోలేకర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం



బీఆర్‌ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

బీఆర్‌ఎస్ నేతలను అడ్డుకున్న పోలీసులు

బెజ్జంకి(సిద్దిపేట): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అరెస్టుకు నిరసనగా బెజ్జంకిలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం సీఎం దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను తేవడంతో అప్రమత్తంగా ఉన్న పోలీసులు దాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో హామీలను అమలు చేయలేదని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్‌గుప్తా, రాజయ్య, తిరుపతిరెడ్డి, శ్రీదర్, నరేశ్, స్వామి, బాలనర్సు, రాజు, మోహన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడిఆవు మృతి

మద్దూరు(హుస్నాబాద్): విద్యుత్ షాక్‌తో పాడిఆవు మృతి చెందిన ఘటన మండలంలోని రేబర్తి గ్రామంలో చోటు శుక్రవారం చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బొమ్మ రమేశ్ ఎప్పటిలాగే పొలం వద్ద గడ్డి మేపేందుకు తన ఆవును తీసుకువెళ్లాడు. ఆవు గడ్డిమేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభానికి తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.లక్ష ఉంటుందని, తనను ఆదుకోవాలని రైతు కోరాడు.



మద్దూరు(హుస్నాబాద్): రోదిస్తున్న రైతు

పాముకాటుతో..

కోహెడరూరల్(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట): పాముకాటుతో ఓ పాడిఆవు మృతి చెందిన ఘటన మండలంలోని బస్వాపూర్ పరిధిలోని మతన్నపేటలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కాల్వ లక్ష్మయ్య తన పొలం వద్ద ఆవును కట్టేశాడు. మధ్యాహ్నం వెళ్లి చూడగా ఆవు మృతిచెంది ఉంది. పాముకాటుతోనే మృతి చెందిందని గుర్తించి విలపించాడు. దాని విలువ రూ.70వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు. అదేవిధంగా కొమురవెల్లికి చెందిన పోతుగంటి రవి తన వ్యవసాయ బావి వద్ద ఆవులను మేపు తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగలడంతో ఒక ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.లక్ష ఉంటుందని, రైతును ఆదుకోవాలని స్థానికులు కోరారు.

దుర్భరంగా మారిన ఆటో డ్రైవర్ల జీవనం

నంగునూర(సిద్దిపేట): ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆటోడ్రైవర్ల బతుకు దుర్భరంగా మారిందని కార్మిక విభాగం నంగునూరు మండలాధ్యక్షుడు గొనెపల్లి సిద్దేశ్వర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ ఆటో కార్మికులపై జరుగుతున్న వివక్షకు నిరసనగా శనివారం తలపెట్టిన బంధుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు యాదగిరి, హన్మంతు, మల్లేశం, కృష్ణయ్య, కృష్ణయ్య, నర్సింహులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిద్దేశ్వర్

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి

మర్కూక్(గజ్వేల్): మతోన్మాద శక్తుల నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఎర్రవల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజు, భాగ్య, కృష్ణ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

గజ్వేల్‌రూరల్: ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇళ్ల వద్ద వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నర్సయ్య సూచించారు. తడి, పొడి చెత్తపై స్థానిక 6, 19వ వార్డులలో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కవులు సామాజిక మార్గదర్శకులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గంగాధర్

హుస్నాబాద్‌రూరల్: కవులు సామాజిక మార్గదర్శకులని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.గంగాధర్ అన్నారు. తెలుగు లెక్చరర్, సాహితీ వేత్త ఎస్ఎస్.రాజు రాసిన 'వెళ్లి రావయ్యా శుభకరా..' అనే పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచనలు సామాజిక మార్పు తేవడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు ఎల్లయ్య, సత్యనారాయ, సదాశివ్, రణధీర్‌కుమార్, చంద్రమోహన్, వాసవి పాల్గొన్నారు.

నార్కోటిక్స్ డాగ్స్‌తో పోలీసుల తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ అభిలాష్

కోహెడ(హుస్నాబాద్): గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం అర్థంతరంగా ముగుస్తుందని ఎస్‌ఐ అభిలాష్ హెచ్చరించారు. మండల కేంద్రంలో పలు అనుమానిత ప్రాంతాలను నార్కోటిక్స్ డాగ్స్‌తో శుక్రవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహస్యంగా మత్తుపదార్థాలను రవాణాచేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనుమానిత వ్యక్తులను గుర్తించి 100కు సమచారం నివ్వాలని కోరారు.

అల్లు అర్జున్‌పై బీఎస్పీ నేతల ఫిర్యాదు

హుస్నాబాద్: పుష్ప–2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా చిక్కడపల్లిలోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతికి కారణమైన సినీనటుడు అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేయాలని బీఎస్పీ నాయకులు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓపెన్ టాప్ కారులో అల్లు అర్జున్ ప్రైవేట్ సెక్యూరిటీతో బలప్రదర్శన చేయడం వల్లే రేవతి మృతి చెందిందన్నారు. ఆమె కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్, నాయకులు శంకర్, సుధాకర్, రాజు ఉన్నారు.



ఫిర్యాదు కాపీని చూపిస్తున్న బీఎస్పీ నాయకులు

సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన

కోహెడ(హుస్నాబాద్): కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ మండలంలోని సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు స్థానిక మండల వనరుల కేంద్రం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ 6, 7వ తేదీల్లో జిల్లాస్థాయిలో నిరసన దీక్షలు చేపడుతున్నామన్నారు. అలాగే 9న నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేశం, రజిత, రాజు, చంద్రమౌళి, నిర్మల, సుమలత, రాజు, సదానందం, మయదేవి, లావణ్య పాల్గొన్నారు.

ఎంఈఓకు సమ్మె నోటీసు

మిరుదొడ్డి(దుబ్బాక: తమ డిమాండ్ల సాధన కోసం నిరవదిక సమ్మె చేపడుతున్నట్లు సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు మహేశ్ తెలిపారు. మండల పరిధిలోని ఉద్యోగులు శుక్రవారం మండల వనరుల కేంద్రంలో నిరసన వ్యక్తం చేసి, ఎంఈఓ ప్రవీణ్ బాబుకు సమ్మె నోటీసు అందించారు. రాజ్యలక్ష్మి, మథిన్, బాల్‌రాజు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

సాహిత్య సభలను విజయవంతం చేయండి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రచయితల సంఘం ప్రతినిధులు

తెలంగాణ రచయితల సంఘం ప్రతినిధులు

సిద్దిపేటకమాన్: తెలంగాణ రచయితల సంఘం పదేళ్ల సాహిత్య సభలు హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం జరుగుతాయని ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సభలకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభల్లో సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిదారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు. 'తెలంగాణ అస్తిత్వ సాహిత్యం– వర్తమాన సందర్భం' అనే అంశంపై సభలు జరుగుతాయని తెలిపారు. సంఘం నేతలు బాలయ్య, యాదగిరి, అశోక్, కె.రంగాచారి, తిరుపతిరెడ్డి, కవి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం అవసరం

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ముమ్మరంగా ప్రచారం చేయాలని చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ కార్యమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన యేడాదిలోనే హామీలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లేశం, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, కనుకచంద్రం, బాలరాజు, రమణారెడ్డి, తాజ్ మహ్మద్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సామూహిక సీమంతాలు**



జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం సూపర్ వైజర్ రజిత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలోనే పౌష్టికాహారం అందుతుందన్నారు. ఆరేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీకి పంపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీచర్లు సరిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

◆ **సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సెంట్రింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సిద్దిపేట పట్టణ సెంట్రింగ్ సంఘం నూతన అధ్యక్షుడు దూబల శ్రీశైలం, గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం పట్టణ సెంట్రింగ్ సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా వెంకటస్వామి ఎన్నికయ్యారు. సంఘం నాయకులు శ్రీనివాస్, రవీందర్, మల్లేశం, బ్రహ్మం నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **యువజన కాంగ్రెస్ నేతకు సన్మానం**



హుస్నాబాద్‌రూరల్: మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెలుపొందిన పోశవేని శ్రీశైలం శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీశైలంను అభినందించి సన్మానించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరే విధంగా కృషి చేయాలని సూచించారు.

◆ **సంక్షేమ ఫలాలు అందేలా కృషి**

నంగునూరు(సిద్దిపేట): పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు అందేలా కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాదుల పవన్‌కుమార్ చెప్పారు. శుక్రవారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ సిద్దిపేటలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

◆ **నూతన నియామకాలు**

బెజ్జంకి(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్ వీరాపూర్, పెరుకబండ గ్రామ కమిటీలను మండల ఇన్‌చార్జి పరశురాములు ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. వీరాపూర్ అధ్యక్షుడిగా చిలముల రవీందర్, ఉపాధ్యక్షులుగా గాలిపెల్లి శ్రీనివాస్, రడం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చిలుముల శ్రీకాంత్‌ను అలాగే పెరుకబండ అధ్యక్షుడిగా సుమన్, ఉపాధ్యక్షుడిగా వడ్లూరి రామచంద్రం తదితరులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. భూమయ్య, పరశురాములు, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

◆ **సామాజిక సేవలతోనే గుర్తింపు**

మిరుదొడ్డి(దుబ్బాక): సామాజిక సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని ప్రముఖ న్యాయవాది, సామాజిక వేత్తలు ఎనగుర్తి యాదగిరి, కృష్ణలీల, మంజుల అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లిలో పెద్దమాతరి యాదగిరి, పున్నమ్మల కూతురు నిఖిత వివాహానికి శుక్రవారం వారు పుస్తె, మట్టెలతో పాటు పట్టు వస్త్రాలు అందజేశారు. మాజీ సర్పంచ్ యాదగిరి, బాల్‌రాజు, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, అంజయ్య, రాజిరెడ్డి పాల్గొన్నారు.

◆ **తప్పులతడకగా కుల గణన సర్వే**

హుస్నాబాద్: అక్కన్నపేట మండలంలో ప్రభుత్వ అధికారులు నిర్వహించే ఇంటింటి కులగణన సర్వే తప్పుల తడకగా మారిందని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి నంబర్లు, కుటుంబ సభ్యుల వివరాలను సిబ్బంది పూర్తి చేయడం లేదని ఆరోపించారు. అధికారులు విచారణ జరిపి సర్వే, సమాచారాన్ని సవరించాలని కోరారు.

◆ **సీపీని కలిసిన నూతన ఎస్‌ఐ**

సిద్దిపేటకమాన్: ఫింగర్ ప్రింట్ బ్యూరో నూతన ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన శరత్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అదేవిధంగా హోంగార్డ్స్ రైజింగ్ డే సందర్భంగా హోంగార్డులు సీపీని కలిసి మొక్కను అందజేశారు. సీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డులు పోలీసులతో సమానంగా పని చేస్తున్నారన్నారు. వారి సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. హోంగార్డ్స్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, హోంగార్డులు సతీశ్, సర్వర్, నర్సింహులు, చంద్రశేఖర్, నరహరి తదితరులు పాల్గొన్నారు.